ఈవారం కథ

# రహస్యం

– టి.వి. పద్మావతి



వృద్ధాప్యం కూడా బాల్యం వంటిదేనన్నారు. అంటే, మనిషి జీవితం మీద తొలి అడుగులు వేయడం నేర్చుకుని, నడచి నడచి జీవితం చుట్టూ తిరిగి, తిరిగీ బాల్యాన్ని... అంటే బయలుదేరిన చోటికి చేరుకుంటాడన్నమాట!
జీవితంలో అన్ని అనుభవాలనూ మించిన మధురమైన అనుభవం బాల్యం. అటువంటి బాల్యం లేని జీవితాలలో ఏం వున్నట్టు?

“నువ్వెప్పుడొచ్చావే తింగిరిదానా” అంటూ వచ్చారు దేవక్క.

స్నానానికి వెళ్ళబోతూ టవల్ వెతుకుతున్న నేను సంభ్రమంగా తిరిగి చూశాను.

చిన్న సూట్‌కేస్, భుజానికి తగిలించిన సంచితో, డెబ్బై వసంతాల జీవితాన్ని చిరునవ్వుతో గెలుచుకున్న దేవక్కను ఒక్క వుదుటున కావులించుకున్నాను.

“వొదలవే తిక్క ...” అంటూ ప్రేమతో నా తల నిమిరింది.

సూట్‌కేస్, సంచి లాక్కుని ఓ మూల పెట్టేసి... దేవక్కను కిచెన్ రూమ్‌లోకి లాక్కెళ్ళాను.

నేను కాఫీ ప్రయత్నంలో వుంటే, ప్రక్కనే కూచొని–

“సాగర్, దీపు బావున్నారటే” అన్నారు.

“ఆహా! ఈసారి దాన్ని ‘దంతసుందరి’ అంటే వొప్పుకోదట” అన్నాను.

“పళ్ళకు క్లిప్స్ వేయించావా? ఏమిటి?”

“అదేం కాదు. పళ్ళు కనిపించకుండా నవ్వుతోందది”

ఆ మాటతో బిగ్గరగా నవ్వేశారు.

“మల్లికార్జున ఎలా వున్నాడే?”

“బావున్నారు దేవక్కా”

“మంచి పిలగాడే. నీలాంటి చెంబేడి దాంతో ఎట్లా వేగుతున్నాడో! అది సరే ఎప్పుడొచ్చావ్?”

“నిన్ననే. నాన్నగారిని చూడాలని వుందన్నాను. వెళ్ళిరమ్మన్నారు. రెండ్రోజులే కదా! పిల్లల్ని చూసుకుంటామన్నారు. మనం బండెక్కేశాం. ఎల్లుండి వెళ్ళాలి”

“నేను వుంటాలేవే. ఈ శ్యామ్‌గాడి పెళ్ళి చేసి గాని వెళ్ళను. ఆ పని మీదే వొచ్చాను”

ఆ మాటతో నాకు కొండంత భారం తీరినట్లైంది. దేవక్క అనుకుంటే ఏదైనా చేసిగాని వదలరు.

“ఈ కాఫీ నీళ్ళు గొంతులోకి దింపండి. నేను రెండు చెంబులు పోసుకుని వస్తాను” అంటూ బాత్రూంలోకి దూరాను.

దేవక్క పూర్తి పేరు రుక్మిణీదేవి. చిన్నతనంలో దేవి, పెరిగి పెద్దయ్యాక దేవక్కగా మారిపోయింది. మా నాన్నగారికి స్వయంగా అక్క. అందరూ ‘దేవక్కా’ అని పిలుస్తుంటే మేము కూడా ఆ అత్తయ్యను ‘దేవక్క’గానే పిలుచుకునేవాళ్ళం.

జీవిత సంగ్రామంలో సత్యభామ ఆమె. నలుగురు కొడుకుల్ని చదివించి, ఇద్దరు కూతుర్లకు

పెళ్ళి చేసి అలసిపోకుండా నిలబడిన ఆదర్శమూర్తి. దేనికీ చెక్కు చెదరదు. ఆమె ధైర్యానికి, శ్రమకు భగవంతుడు కూడా సహాయం చేశాడు. ఇప్పుడు మనవళ్ళందరూ ఇంజనీరింగ్ చేస్తున్నారు. మన వరాళ్ళు చక్కగా చదూకుంటూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు.

ఎక్కడో విశాఖలో వుంటున్నా, ప్రతి సంవత్సరం ముఖ్యంగా బుద్ధ పూర్ణిమనాడు తంచనుగా ఇక్కడ హాజరు కావలసిందే. దేవక్క వచ్చారంటే బుద్ధపూర్ణిమ ఆ దరిదాపుల్లో వున్నట్లే లెఖ్ఖ. ఆ రోజు జరిగే భావ నారాయణస్వామి తిరునాళ్ళంటే ఆమెకెంత ఇష్టమో. నిజం చెప్పాలంటే మా కంటే కూడ ఆమెకే ఎక్కువ సంతోషం. బాల్యాన్ని మరచిపోని మధుర జీవి ఆవిడ.

ఈ వయసులో కూడ ఒంటరిగానే ప్రయాణం చేస్తుంది. కొడుకుల దగ్గరకు, కూతుర్ల దగ్గరకు, బంధువుల దగ్గరకి ఏకంగా ప్రయాణం చేస్తూనే వుంటుంది. కాదంటే మా ఇంట్లో వున్నన్ని రోజులు మరెక్కడా వుండదు. మా మీద ప్రేమో, ఈ వూరి మీద మమకారమో! దేవుడికే తెలియాలి.

సాయంత్రం తీరిగ్గా బైట కుర్చీలు వేసుకుని కూచున్నాం. సినిమాలకు వెళ్ళే జనాల్ని చూస్తూ, కాఫీ చప్పరిస్తూ కబుర్లలో పడ్డాం. మా కబుర్లలోకి శ్యామ్ కూడా జాయిన్ అయ్యాడు.

"వురేయ్! నీకు పెళ్ళి చేసి కాని రానని సింహాచలం స్వామికి చెప్పివచ్చాను" అన్నారు దేవక్క.

శ్యామ్ నవ్వి వూరుకున్నాడు.

"కథలు రాస్తావు. రేడియోకి నాటికలు రాస్తావు. ఆ మాత్రం తెలీదట్రా. ఇంట్లో నువ్వు, నాన్నగారు, శేషు వుంటున్నారు. ఆడపిల్ల లేని ఇల్లు ఎలా వుంటుందో తెలీదూ. నా మాట విని శుభ్రంగా పెళ్ళి చేసుకో. ఉద్యోగం అదే వస్తుంది. తిండికి, గుడ్డకు కొదువలేదు కదా!"

"పెళ్ళి చేసి నువ్విక్కడే వుండవే. మల్లెపూలకు, మిఠాయికి నాకు డబ్బులు ఇస్తుందు" అన్నాడు శ్యామ్.

"దొంగ చచ్చినోడా! నువ్వు మగాడివి కాదట్రా. చిన్న పిల్లలప్పుడు మీ మామయ్యగారు కాలధర్మం చేస్తే, ఆడదాన్ని, ఒక్కదాన్ని ఎదురీది నిలబడి పిల్లల్ని ఇంతవాళ్ళని చేశాను. మీసమున్న మగాడివి. మగాడిలా మాట్లాడటం నేర్చుకో"

"ఆ. నేనేం పెద్ద మగాణ్నిలే దేవక్కా"

అందరం నవ్వేశాం.

నా వైపు చూసి కన్ను గిలికించి, ఏదో చెప్పబోయేంతలో శ్యామ్ తుర్రుమన్నాడు.

"వెళ్ళరా. వెళ్ళు. మళ్ళీ రావూ?" నాన్నగారి వైపు చూసి–

"నువ్వు చూడరా. వీడెట్లా చేసుకోడో చూస్తాను" అన్నారు.

"అక్కా! నువ్వు మరి కాస్త గట్టిగా మాట్లాడితే వాడు ఇంటికి కూడా రాడు. తర్వాత నీ ఇష్టం" అని నాన్నగారు కూడా జారుకున్నారు.

చక్కగా నవ్వుతూ నేను మాత్రం ఎదురుగా వుండిపోయాను.

"నీ నవ్వు అచ్చు మీ అమ్మ నవ్వులా వుంటుందే. చల్లగా, హాయిగా, నిజంగా నిర్మలంగా వుండేది మీ అమ్మ నవ్వు. ఏమిటో! నా బోటి దాన్ని తీసుకెళ్ళ కూడదూ ఆ దేవుడు" కళ్ళు తుడుచుకున్నారు.

అమ్మ మాట ఎత్తేసరికి నా నవ్వు కూడ మూగపోయింది.

"అవునే. 'ఫ్యూచర్‌మే దఢ్ దఢ్...' ఎలా వుంది?"

"ఎవరు?" అన్నాను అర్థం గాక.

"శైలూనే"

ఇంతలో కలత పెట్టి, అంతలోనే గిలిగింతలు పెట్టే మనస్తత్వం దేవక్క గారిది. పెళ్ళికి ముందు శైలు అంటుండేది. ఏదైనా అంటే 'ఇప్పడే ముందే, ఫ్యూఛర్ మే దేఖ్... దఢ్ దఢ్" అంటుండేది.

"బావుంది దేవక్కా. హర్షగాడి అల్లరి చూడాల్సిందే. మీరు దీపుకి దంత సుందరి అని పేరు పెడితే వాడికి నేను 'స్నాన సుందరుడ'ని పెట్టాను. స్నానానికి వెళ్తే ఆ బుడగణ్ణి తిరిగి తీసుకురావటం మన వల్ల కాదు మగ రవీనా టాండన్..."

"అదెవతే"

"సినిమా యాక్ట్రెస్. ఆవిడ స్నానం అంటే మహా ఇష్టం"

"రోజా చేయదా ఏం? సావిత్రి తర్వాత సినిమా ఆడాళ్ళు ఎవరున్నారులే"

ఆవిడతో వాదిస్తే మరిన్ని వాతలు వేయించుకోవాల్సిందే.

నన్నగా నవ్వి వూరుకున్నాను.

భోజనాలయ్యాక లేత వెన్నెల్లో దేవక్కగారు, నేను మేడమీద పడక వేశాం. కాసేపు ధ్యానం చేసుకుని వచ్చి నా ప్రక్కనే కూచున్నారు. పిల్ల వెన్నెల లోకాన్నంతా వెలుగుతో నింపాలని శతవిధాల ప్రయత్నం చేస్తూంది. లీలగా సినిమా హాల్లోని గోల వినపడుతోంది.

యథాలాపంగా అడిగాను.

"బుద్ధపూర్ణిమ ఎన్ని రోజులుంది దేవక్కా"

"చాలా రోజులుంది లేవే. ఆ రోజు నువ్వు, మల్లికార్జున, పిల్లలు రారా ఏమిటి?"

"మీరు వచ్చారని తెలిస్తే ఆయన ఇప్పడే పరిగెత్తుకొస్తారు. మీ జీవితమంతా గొప్ప నవలగా రాయమని నన్ను పోరుతుంటారు"

"నా జీవితం ఏముందే పిచ్చిదానా" అంటూ తేలిగ్గా తీసివేశారు.

"పద్మా! ఈ మధ్య ఒక విచిత్రమైన కోర్కె బలంగా కలిగి స్థిరపడిపోయింది. కొడుకులు, కూతుళ్ళు, వాళ్ళ పిల్లలు అందరూ హాయిగా, ఆనందంగా వున్నారు. నిజంగా కోర్కెలు తీరిపోయిన జీవితం నాది. నా బాధల్లా మీ నాన్నగారి గురించే. ఆడపిల్లలు మీరు వెళ్ళిపోయారు. మొగుళ్ళు మంచోళ్ళు కాబట్టి తరచు వస్తున్నారు. చిన్నతనంలో మాకు అన్నీ చేసిపెట్టేవాడే మీ నాన్న. ఈ మగపిల్లలిద్దరు ప్రయోజకులై పెళ్ళిళ్ళు చేసుకుని ఆయన్ని పువ్వుల్లో పెట్టి చూసుకునేరోజు కోసమే ఎదురుచూస్తున్నాను. నువ్వు నమ్మవే. ఎవర్ని మోసం చేసినా మన ఆత్మను మోసం చేసుకోలేం కదా! మీ నాన్నగారు చేసిన సహాయానికి మేము నలుగురం అక్క చెల్లెళ్ళం ఏమీ చేయలేకపోయాం" దేవక్క కళ్ళలో నీళ్ళు నిళిచాయి.

"అలా అంటారేం దేవక్కా. ఈ వయసులోను అభిమానాలు వొదులుకోక మీరు వచ్చిపోతున్నారు. అంతకంటె మీరు చేయాల్సిన సాయం ఏముంది?" అన్నాను.

"చిన్నపిల్లవు. నీకు తెలీదులేవే" అని కళ్ళజోడు తీసి పైట కొంగుతో కళ్ళు తుడుచుకున్నారు.

చందమామ మబ్బుల చాటుకు జారుకున్నాడు.

నా చిన్న సంసారంలో ఏర్పడే అతి చిన్న సమస్యలకే అతలాకుతలం అయిపోతాను. మరి దేవక్క అంత జీవితాన్ని పూల మీద నడిచినట్టు ఎలా నడిచింది?



బరువైన గుండెతో దేవక్క, ఆలోచనలతో నేను మౌనంగా వుండిపోయాం. నా శరీరం ఇక్కడ వుంది కాని మనసు మాత్రం శ్రీవారి దగ్గరే వుంది. పిల్లలతో ఆయన ఏమి తిప్పలు పడు తున్నారో. పిల్లలు సాయంత్రాలు చదువుకుంటు న్నారో, లేదో... ఇలా వున్నాయి నా ఆలోచనలు.

"రేపు గుర్తు చేయవే. ఒక విషయం చెప్పాలి" అని దేవక్క ధ్యానంలో కూచున్నారు.

నేను. మునుగు తన్నేశాను.

తెలతెలవారుతుండగా పక్క మీద ఒక్కటిచ్చి లేపారు దేవక్క. మత్తుగానే లేచి ఆమె వెంట భావనారాయణ స్వామి గుడి వరకు 'మార్నింగ్ వాక్' వెళ్ళివచ్చాను. నడకలో నేను ముసలిదాన్ని. ఆవిడ కుర్రపిల్ల.

నా ఆలోచనలన్నీ దేవక్క గారి చుట్టూ. పరిభ్ర మిస్తున్నాయి. నాకు పెళ్ళై ఎనిమిదేళ్ళు. ఇద్దరు పిల్లలు. నా చిన్న సంసారంలో ఏర్పడే అతి చిన్న సమస్యలకే అతలాకుతలం అయిపోతుం టాను. ఒక్కోసారి నిద్ర పట్టదు. మనశ్శాంతి వుండదు. మరి ఈ దేవక్క ఇంత జీవితాన్ని పూల మీద నడిచినట్లు-దాటుకుంటూ ఎలా వెళ్ళగ లుగుతుంది. ముఖంలో ప్రశాంతత, చిరునవ్వు, ఆరోగ్యం త్రిమూర్తుల్లా ఎలా వుంటున్నాయి.

జీవిత రహస్యాన్ని కనుగొనటంలో నేను ఎక్కడ 'మిస్' అయ్యాను?

అడగాలి. ఈ ప్రశ్న దేవక్క గారిని.

తీరిక చూసుకుని నా ప్రశ్న వొదలాలని అను కుంటున్నంతలో- అంజక్క, సూరక్క దిగారు. చచ్చాం. మరి తీరిక లేకుండా పోయింది. వాళ్ళ కబుర్లలో పడ్డారు. దేవక్క మహా బిజీ అయిపో యారు. లోకంలోని అన్ని విషయాలు అవలీలగా మాట్లాడుకుంటుంటే శ్రోతలా వుండిపోయాను.

నాకేమీ తోచుబడక ఊలుతో చిన్న బ్యాగ్ అల్లుతూ నాన్నగారితో సినిమాల కబుర్లు మొద లుపెట్టాను. నాన్నగారు అద్భుతంగా పాడుతారు. 1942 ప్రాంతంలోని రాజేశ్వరరావుగారి పాటలు, ఆ తర్వాత యమ్మెస్ రామారావుగారి "ఈ ప్రశాంత, నిశాంత, ఏకాంత సౌధంలో నిదురించు జహ పనా..." వంటి మధుర గీతాలు చెప్తుంటే మనసంతా మధురంగా వుండిపోయింది. ఈనాటి సినిమాలు, చెత్తపాటలు తల్చుకుంటే శరీరం గగు ర్పాటు చెందింది. ఎంత మార్పు?

"అమ్మా! తీరిగ్గా కూచున్నావు. దేవక్క ఏం చేస్తోంది" నా ఆలోచనలను భంగం చేస్తూ అడి గారు నాన్న.

"అంజక్క, సూరక్క వాళ్ళతో కబుర్లలో పడ్డారు నాన్నా"

నాన్నగారి వొంక చూస్తూ-

"ఈ వయసులో కూడ దేవక్క అంత యాక్టివ్‌గా ఎలా వుండగలుగుతున్నారు. జీవితంలో నీడల్ని తప్పించి, వెన్నెల్నే ఆస్వాదించే భావుకురాలుగా ఎప్పుడూ కనిపిస్తుంది. అందరికీ సాధ్యమేనా? నా వరకు నేనే వుండలేకపోతున్నాను నాన్నా"

నాన్నగారు సమాధానం చెప్పలేదు.

కాసింత మౌనం వహించి-

"నిజమేనమ్మా. జీవిత రహస్యాన్ని తెలుసు కోటంలో నేను కూడా విఫలమైనాను. దేవక్క తెలుసుకున్నట్లుంది" అన్నారు గంభీరంగా.

అదేదో దేవక్కగారినే అడగాలని గట్టిగా నిర్ణయిం చుకున్నాను. మర్నాడు,

వూరికి బయల్దేరే హడావిడిలో వున్నాను.

చప్పున గుర్తు వొచ్చింది.

"మొన్న మీరు గుర్తు చేయమన్నారు. ఏదో విషయం చెప్తానన్నారు" అన్నాను దేవక్కతో.

"ఓసి తిక్క. ఇప్పుడా గుర్తు చేసేది. స్టేషన్‌లో చెప్తాములే"

"మీరు స్టేషన్‌కి వస్తున్నారా?"

"నీకు ఇబ్బందా?"

"నాకేం?"

"మరి నోర్మూసుకుని పద"

తీరా స్టేషన్‌కి వచ్చేసరికి కృష్ణా ఎక్స్‌ప్రెస్ నలభై నిమిషాలు లేటు. ఎప్పుడూ విసుగనిపించే నాకు ఈ రోజు మహదానందమైంది. దేవక్క గారు చెప్పే విషయం వినాలి. నేను అడగాలనుకున్నది కూడా అడగవచ్చు.

తీరిగ్గా ఓ సిమెంటు బల్ల మీద కూలబడ్డాం.

శ్యామ్ ఎవరో ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్నాడు.

"చెప్పండి దేవక్కా" అన్నాను.

కళ్ళు పైకెత్తి నా వొంక చూసి నవ్వుగా నవ్వారు. నాకు మొనాలిసా నవ్వు గుర్తువొచ్చింది.

"ఏం లేదే, పిల్లా. మా అక్క చెల్లెళ్ళకు, చివరకు మీ నాన్నకు కూడా చెప్పని విషయం వొకటి నీకు చెప్పాలనిపించింది. కుర్రకుంకవైనా నువ్వు ఎక్కడా



నోరు జారవు. విను. ఇక్కడే ఎక్కడైనా చిన్న ఇల్లు తీసుకుని శేష జీవితం వెళ్ళబెట్టేయాలనిపిస్తుంది"

నేను ఆశ్చర్యంతో నోరు తెరిచాను.

ఉన్నతమైన ఉద్యోగాల్లో వున్న కొడుకులు, ఆత్మీ యత నిండిన కూతుళ్ళు, హుషారైన మనుమళ్ళు, మనుమరాళ్ళు... ఆంధ్రలో అన్ని మూలల విస్త రించిన సంసార వృక్షం దేవక్కగారిది. హాయిగా ఏ కొడుకు దగ్గరో గడపక ఈ విచిత్రమైన కోర్కె ఏమిటి?

నా ఆశ్చర్యం ఆమెకు అర్థమైంది.

"పద్మా! బాల్యం నా కళ్ళ ముందు కదలాడు తుందే. ఆ స్వామి గుడిగంటలు, వెన్నెల రాత్రులు దొంగాటలు, తొక్కుడుబిళ్ళ ఆటలు... నా హృద యాన్ని పరవశింపజేస్తున్నాయి. అంతా మిథ్యలా వుంది. ఆ బాల్యమొక్కటే నిజంలా వుంది. బాల్యంలోంచి గబగబ నడిచి, పరుగెత్తి మళ్ళీ బాల్యంలోకి వచ్చినట్లు వుంది. నీకో నిజం చెప్పనా! నా జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవిం చాను. కానీ ఎప్పుడూ బాధపడలేదు. మధురమైన నా బాల్య జీవితపు గుర్తులు కవచంలా నన్ను కాపాడుతూ వున్నాయి. ఏ మనిషైనా బాల్యాన్ని మరచిపోతే మనిషిగా జీవించలేడు. యంత్రంలా వుండిపోతాడు. బాల్యాన్ని గుర్తు తెచ్చుకుంటూ వుంటే బాధలే తెలీవు. అందుకే ఇలాంటి నిర్ణయా నికి వచ్చాను"

ఒక్క క్షణం దేవక్క ముఖంలోకి చూశాను.

ఆమె కళ్ళలో తడి తళుక్కున మెరిసింది.

నేను అడగాలనుకున్న ప్రశ్నకు సమాధానం దొరి కినట్టైంది.

ఎవరు ఎక్కడ జీవితాన్ని 'మిస్' అవుతారో సరిగ్గా అక్కడే పట్టుకుని జీవితాన్ని అర్థవంతం చేసుకోగలిగారు దేవక్క.

"ఏమంటావు?" అడిగారు దేవక్క.

సమాధానం చెప్పలేదు నేను.

గట్టిగా ఆమె తలను రెండు చేతులతో పట్టు కుని నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాను.

ట్రైన్‌లో కూచొని దేవక్కగారి గురించి ఆలో చిస్తుంటే మధురమైన చిరునవ్వు నా ముఖాన్ని వెలిగిస్తూనే వుంది. ఆలోచనలలోంచి పుట్టిన ఓ ప్రశ్న నన్ను కలవరపెట్టింది.

ఈనాటి పిల్లలకు బాల్యం అంటూ వుందా?

తల్లిదండ్రులు వాళ్ళ బాల్యాన్ని, వాళ్ళ ఇష్టానికి వదులుతున్నారా? కనీసం ఓ గంటైనా. మధుర మైన బాల్యమే లేని పిల్లలు రేపు పెరిగి పెద్దై ఎలా తయారవుతారు?

ప్రశ్న పెరిగి పెరిగి భూతంలా నన్ను ఆక్రమి స్తుంటే- బండెడు పుస్తకాలు ముందు వేసుకుని నా కొడుకు, కూతురు వెక్కిరిస్తూ ఎదురుగా కళ్ళముందు కదలాడారు.

స్థిరమైన నిర్ణయానికి వచ్చి, తృప్తిగా తల సీటుకు ఆనించి కళ్ళు మూసుకున్నాను. ●